# బదిలీల్లోనూ బాదేశారు..



టీచర్ల నుంచి రూ.లక్షల్లో వసూలు చేసిన వైసీపీ నేతలు

బదిలీల రద్దుతో ఆందోళనలో 148 మంది ఉపాధ్యాయులు

చిత్తూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు వైసీపీ నాయకులు టీచర్ల వద్ద రూ.లక్షల్లో ముడుపులు తీసుకుని బదిలీ చేయించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 148 మంది టీచర్ల వద్ద డబ్బు తీసుకుని ఏప్రిల్‌లో బదిలీ ఉత్తర్వులు తెప్పించారు. ఈ విషయం బహిర్గతం కావడంతో అక్రమ బదిలీలుగా అప్పట్లో ప్రతిపక్షాలు ఆరోపించాయి. రద్దు చేయాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడక ముందే ఈ బదిలీలను రద్దు చేస్తూ ఈ మధ్య విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో డబ్బులిచ్చి బదిలీ ఉత్తర్వులు పొందిన 148 మంది టీచర్ల ఆర్డర్లు రద్దయ్యాయి. ఒక్కో బదిలీకి సగటున రూ.4 లక్షలు తీసుకున్న వైసీపీ ప్రజాప్రతినిధులు ఇప్పుడు ముఖం చూపించడం లేదు. అటు బదిలీ అవ్వక, ఇటు డబ్బులు అందక బాధిత టీచర్లు లబోదిబోమంటున్నారు.

### వైసీపీ విధానాల వల్లే బదిలీలు కోరిన టీచర్లు

వైసీపీ ప్రభుత్వం 117 జీవో తీసుకొచ్చి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను స్థానిక ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం.. అందులోని టీచర్ పోస్టులను రద్దు చేయడం తెలిసిందే. అలా పోస్టులు రద్దయిన టీచర్లను గతంలో జరిగిన బదిలీల్లో దూరంగా వేశారు. వారిలో కొందరు కుటుంబ పరిస్థితులు, ఆరోగ్య సమస్యలు వంటి కారణాలతో తిరిగి అదే మండలానికి రావాలని కోరుకున్నారు. వారి అవసరాన్ని అదునుగా భావించి వైసీపీ నాయకులు రూ.లక్షల్లో వసూలు చేశారు.

### భర్తకు తోడుగా ఉందామని..

తిరుపతిలో నివాసముంటున్న ఓ మహిళా టీచర్ నగరి నియోజకవర్గంలోని పాఠశాలలో పనిచేస్తున్నారు. టీచర్ అయిన ఆమె భర్తకు ఇటీవల ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగింది. దీంతో భర్తకు దగ్గరగా ఉండాలని భావించి బదిలీ కోసం ఓ అధికార పార్టీ ప్రజాప్రతినిధిని ఆశ్రయించారు. విద్యాశాఖ మంత్రి పేషీలో ప్రయత్నించి రూ.3.50 లక్షలకుపైగా ఖర్చు పెట్టుకున్నారు. ఎట్టకేలకు ఏప్రిల్‌లో బదిలీ ఉత్తర్వులు సాధించారు. తాజాగా అవి రద్దు కావడంతో తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

### రూ.6 కోట్ల వసూలు

బదిలీ అవసరమైన టీచర్ల నుంచి ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధులు రూ.6 కోట్లు వసూలు చేసినట్లు ఓ అంచనా. విద్యాశాఖ మంత్రి పేషీలో, సీఎంవోలో పరిచయాలు ఉన్నవారు ఈ వ్యవహారాన్ని డీల్ చేశారు. జిల్లాలో మంత్రులు, ఎమ్మెల్యేలంతా ఇందులో భాగస్వామ్యులై ఉన్నట్లు సమాచారం. ఒక్కో టీచర్ నుంచి రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు వసూలు చేసినట్లు బాధితులు చెబుతున్నారు.

### రూ.4 లక్షలకు వడ్డీ కడుతున్న మహిళా టీచర్

జీడీనెల్లూరు నియోజకవర్గంలో పనిచేసే ఓ మహిళా టీచర్ 117 జీవో కారణంగా పనిచేస్తున్న పాఠశాలలో పోస్టు రద్దు కావడంతో బదిలీకి అయ్యారు. అదే మండలంలో పనిచేస్తున్న ఆమె భర్తను, కుటుంబాన్ని వదిలి పలమనేరు నియోజకవర్గంలోని ఓ పాఠశాలలో చేరారు. దూర ప్రాంతం కావడంతో రోజూ ప్రయాణం చేయలేక, 7వ తరగతి చదువుతున్న కుమారుడిని తోడుగా ఉంచుకుని పలమనేరులో అద్దెకు ఉంటూ విధులకు వెళ్లి వచ్చేవారు. ఆరు నెలల కిందట ప్రమాదానికి గురై మంచానికే పరిమితమైన మామ, వృద్ధాప్యంలో ఉన్న అత్తను చూసుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఎలాగైనా ఇంతకు ముందు పనిచేస్తున్న మండలానికి బదిలీ కావాలని ఉన్నతాధికారుల చుట్టూ తిరిగారు. లాభం లేకపోయింది. అధికార పార్టీకి చెందిన ఓ నేతను సంప్రదించగా రూ.4 లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. ఆ మేరకు డబ్బు వడ్డీకి తెచ్చి ఏప్రిల్‌లో బదిలీ ఉత్తర్వులు సాధించారు. కుటుంబానికి దగ్గరగా వచ్చానని సంతోషించే లోపే ఆ బదిలీలు రద్దు కావడం, వైసీపీ నేత రూ.4 లక్షల ప్రస్తావన తేకపోవడంతో ఆమె ఆవేదన చెందుతున్నారు. నెల నెలా వడ్డీ కట్టుకుంటున్నారు.

# అనధికార తట్టలకు బ్రేక్

తిరుమల కొండపై మొదలైన ప్రక్షాళన

వరాహస్వామి విశ్రాంతి గృహం వద్ద అనధికార తట్టలను మూసివేయిస్తున్న అధికారులు



తిరుమల, జూన్15(ఆంధ్రజ్యోతి): తిరుమల నుంచే ప్రక్షాళన మొదలవుతుందని ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత చంద్రబాబు ప్రకటించడంతో టీటీడీ అధికార యంత్రాంగంలో చురుకు మొదలైంది. తిరుమలలో ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయిన అనధికార తట్టల (చిన్న షాపులు)ను తొలగించే పని ప్రారంభమైంది. విజిలెన్స్, హెల్త్, రెవిన్యూ విభాగాల టాస్క్‌ఫోర్ బృందం శనివారం తిరుమలలో పలు చోట్ల ఆకస్మిక దాడులు చేసింది. వెంగమాంబ నిత్యాన్నప్రసాద భవనం వద్దనున్న అనధికార తట్టలను మూసివేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా వ్యాపారాలు చేస్తే ఇకపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక ముందు కూడా దాడులు కొనసాగుతాయని కాలం చెల్లిన లైసెన్సులతో వ్యాపారాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. చంద్రబాబు తిరుమలకు వచ్చినపుడు ఆక్రమణలు, అనధికార తట్టల గురించి స్థానిక టీడీపీ కార్యకర్తలు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే తిరుమలలో ప్రక్షాళన మొదలైనట్టు తెలుస్తోంది.

### పుట్టగొడుగుల్లా తట్టలు

నిబంధనల ప్రకారం టీటీడీ నుంచి లైసెన్సులు ఉండే వారే తిరుమలలో వ్యాపారాలు చేసుకోవాలి.అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తట్టలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా తట్టలు పెట్టి వ్యాపారాలు మొదలు పెట్టారు. అధికారికంగా లైసెన్సులు పొందినవారి జీవనాన్ని దెబ్బకొట్టేలా అడ్డదిడ్డంగా తట్టలు పెట్టి వ్యాపారాలు చేస్తూ హల్‌చల్ చేశారు. వీరిని టీటీడీ అధికారులు కూడా నియంత్రించలేకపోయారు. తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం నుంచి బయటకు వచ్చే ప్రదేశంలో, వరాహస్వామి విశ్రాంతి గృహం ముందు, షాపింగ్‌కాంప్లెక్స్ వద్ద డీఎంబీ రోడ్డు వంటి ప్రాంతాల్లో తట్టలు భారీగా పెరిగిపోయాయి. వ్యాపారం బాగా జరిగే కొన్ని ప్రాంతాల్లో తట్ట నడుపుకునే వారు దాని యజమానికి రోజుకు రూ.వెయ్యి కూడా చెల్లిస్తుంటారు. ఇంత ఆదాయం వచ్చే మార్గం కావడంతో నాయకులంతా తట్టల మీద పడ్డారు.ఐదేళ్లు వైసీపీ వారు తట్టలు నడుపుకున్నారు.రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఇప్పుడిప్పుడే టీడీపీ వారు కూడా అనధికార తట్టలు పెట్టిస్తున్నారు. హోటళ్ల తరహాలో సాగుతున్న ఈ వ్యాపారాలు నిజమైన అనుమతులున్నవారి వ్యాపారాలను దెబ్బతీస్తుండడంతో వారు లబోదిబోమంటున్నారు.



సినీ నటులు సాయిధరమ్ తేజ్, ప్రగ్యా జైస్వాల్ శనివారం ఉదయం తిరుమల వెంకన్నను దర్శించుకున్నారు.



# స్మార్ట్ క్లాస్‌రూమ్స్ ప్రారంభం



డిజిటల్ క్లాస్ రూమ్‌లో ఎంఈవో ప్రేమలత తదితరులు

ఏర్పేడు, జూన్ 15:ఏర్పేడు మండలంలోని మోదుగులపాళెం, పాపానాయుడుపేట, మర్రిమంద, ఆమందూరు, చిందేపల్లె ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్ రూమ్స్ శనివారం ప్రారంభమయ్యాయి. టీచ్ ఫర్ ఛేంజ్ ఛైర్‌పర్సన్ మంచు లక్ష్మి , శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి వీటిని ప్రారంభించారు. ఒక్కో పాఠశాలకు రూ.లక్ష విలువైన డిజిటల్ టీవీ, టేబుల్స్, కుర్చీలు, పెయింటింగ్స్ అందజేశారు. ఈ సందర్భంగా మంచు లక్ష్మి మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో పది స్మార్ట్ కాస్‌రూమ్‌లను ఏర్పాటు చేయాలని టీచ్ ఫర్ ఛేంజ్ తరపున లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.టీడీపీ నాయకుడు ధనంజయులు నాయుడు, ఎంఈవో ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.



మోదుగులపాళెంలో డిజిటల్ క్లాస్ రూమ్‌ను ప్రారంభిస్తున్న మంచు లక్ష్మి, సుధీర్‌రెడ్డి

# నేడు సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్ష

- తిరుపతిలో 11 పరీక్షా కేంద్రాలు
- హాజరు కానున్న 5,518మంది అభ్యర్థులు


తిరుపతి(కలెక్టరేట్), జూన్ 15: యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్షలు ఆదివారం తిరుపతి నగరంలోని 11 కేంద్రాల్లో జరగనున్నాయి. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సజావుగా పరీక్ష రాసేలా జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ పరీక్షకు 5,518మంది అభ్యర్థులు హాజరు కానున్నారన్నారు. ఉదయం 9.30నుంచి 11.30గంటల వరకు, మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 4.30గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయి. పరీక్ష సమయానికి 30 నిమిషాల ముందు అభ్యర్థులు చేరుకోవాల్సి ఉంటుందని అధికారులు ఇప్పటికే స్పష్టం చేశారు. నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదు.అభ్యర్థులు హాల్‌టికెట్‌తోపాటు ప్రభుత్వ గుర్తింపు పొందిన ఐడీ కార్డు కూడా వెంట తీసుకెళ్లాలి. బస్టాండు నుంచి పరీక్ష కేంద్రాలకు చేరుకోవడానికి వీలుగా బస్సులను ఏర్పాటు చేశారు. తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేశారు. సమస్య లెదురైతే 90006 65565 నెంబరుకు ఫోన్ చేయొచ్చు.

# టీటీడీ ఈవోగా శ్యామలరావు బాధ్యతల స్వీకారం నేడు

తిరుమల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఈవోగా శ్యామలరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న ఆయన్ను టీటీడీ ఈవోగా నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.ఈక్రమంలో ఆయన ఆదివారం ఉదయం తిరుమలకు చేరుకుని శ్రీవారి ఆలయంలోకి వెళ్లనున్నారు. అక్కడ జేఈవో వీరబ్రహ్మం నుంచి ఈవోగా బాధ్యతలు స్వీకరించనున్నారు. అనంతరం వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్టు సమాచారం.

# మద్యం మత్తులో దారుణహత్య

- పోలీసుల అదుపులో ఐదుగురు నిందితులు



ప్రసాద్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 15: అలిపిరి పోలీసు స్టేషన్ పరిధిలోని ఆటోనగర్‌లో ఓ డ్రైవర్‌ను సుత్తితో తలపై బాది కత్తులతో నరికి దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చంద్రగిరి మండలం ముంగిలిపట్టుకు చెందిన ప్రైవేటు వాహన డ్రైవర్ ప్రసాద్ కొన్నేళ్ల క్రితం ఆటోనగర్ సమీపంలోని చైతన్యపురం కాలనీలో ఉండేవాడు. ఆ తర్వాత కాపురాన్ని చంద్రగిరి మండలం ముంగిలిపట్టుకు మార్చాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం ఆటోనగర్‌లో ఉంటున్న స్నేహితుడు బాలకృష్ణను కలవడానికి బయల్దేరాడు. మార్గమధ్యంలో తనకు తెలిసినవారు ఐదుగురు మద్యం తాగుతుంటే అక్కడికెళ్లి వారితో మాట్లాడాడు. ఈ ఐదుగురిలో పాత నేరస్తుడు వెంకటేష్ కూడా ఉన్నాడు. అనంతరం బాలకృష్ణ వద్దకొచ్చి మాట్లాడాక ఇంటికి బయల్దేరాడు. అయితే ఇంతకు ముందు కలిసినవారు ఇంకా అక్కడే కూర్చొని మద్యం తాగుతున్నారు. దాంతో ప్రసాద్ కూడా వారితో కలిసి మద్యం తాగాడు. ఈ సందర్భంగా మాటామాటా పెరిగి గొడవ మొదలైంది. మద్యం మత్తులో ఉన్న పాత నేరస్తుడు వెంకటేష్.. మిగిలినవారితోకలిసి ప్రసాద్ తలపై సుత్తితో బాదాడు. ఆ తర్వాత పదునైన కత్తులతో మెడపై అతి కిరాతంగా నరికి చంపేశారు. స్థానికులు వెంటనే అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ రవిమనోహరాచారి, సీఐ రామారావు, సిబ్బంది పరిశీలించారు. ప్రసాద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు. అలిపిరి సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, పాత నేరస్తుడు వెంకటేష్‌పై పలు కేసులు ఉన్నాయని అలిపిరి సీఐ చెప్పారు. జైలుకు కూడా పోయి వచ్చాడన్నారు. ఐదుగురు నిందితులు పోలీసుల అదుపులో ఉన్నారు.

### పాఠాలు చెబుతుండగా గుండెపోటు

#### చికిత్స పొందుతూ కన్నుమూసిన లెక్కల టీచరు



నింద్ర, జూన్ 15: గుండెపోటుతో గణిత ఉపాధ్యాయుడు సురేష్ బాబు(52) మృతి చెందారు. ఆయన నింద్రలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. శనివారం విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తూ గుండెపోటు రావడంతో క్లాసు రూమ్‌లోనే కుప్పకూలిపోయారు. విద్యార్థులు కేకలు వేయడంతో సహోపాధ్యాయులు వెంటనే నింద్రలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యసేవలు అందిస్తుండగా ఆయన మృతి చెందారు.

### గూడూరు మార్కెట్‌కు తైవాన్ రకం నిమ్మకాయలు



గూడూరు అర్బన్, జూన్ 15 : గూడూరు నిమ్మ మార్కెట్‌లో తైవాన్ రకం నిమ్మకాయలు దర్శనమిస్తున్నాయి.స్థానిక నిమ్మకాయ 50 గ్రాముల వరకూ బరువుంటుంది. తైవాన్ రకం 100 గ్రాముల నుంచి 150 గ్రాముల వరకు తూగుతుంది. చీనీపండ్లను పోలివుండే ఇవి సాధారణ నిమ్మకాయల కంటే ఎక్కువ బరువు తూగుతాయని సాగు చేపట్టారు. అయితే చూసేందుకు పెద్దవిగా ఉన్నా ఎక్కువ రోజులు నిల్వ ఉండకపోవడంతో వీటికి గిరాకీ లేదు. సాధారణ రకం నిమ్మకాయలు శనివారం కిలో రూ.50 నుంచి రూ.70 పలకగా, తైవాన్ రకం కిలో రూ.20 నుంచి రూ.40 మాత్రమే పలికాయి.

# రేపటినుంచి అమ్మవారి తెప్పోత్సవాలు

తిరుచానూరు, జూన్ 15: పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు సోమవారం నుంచి ఐదురోజులపాటు ఘనంగా జరగనున్నాయి. రోజూ సాయంత్రం 6.30 నుంచి రాత్రి 7.30గంట వరకు అమ్మవారు పద్మసరోవరంలోని తెప్పలపై విహరించి భక్తులకు దర్శనమివ్వనున్నారు. ప్రతి ఏడాది అమ్మవారికి జేష్ఠ శుద్ధ ఏకాదశి నుంచి పౌర్ణమి వరకు రమణీయంగా తెప్పోత్సవాలు నిర్వహిస్తారు. తొలిరోజున (సోమవారం) రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి, మంగళవారం 18న సుందరరాజస్వామి, 19, 20, 21 తేదీల్లో పద్మావతి అమ్మవారు తెప్పలపై విహరిస్తారు. ఉత్సవాలు పురస్కరించుకుని చివరి మూడ్రోజులపాటు పద్మసరోవరంలోని నీరాడ మండపంలో మధ్యాహ్నం మూడు నుంచి సాయత్రం 4.30గంట వరకు అమ్మవారికి స్నపన తిరుమంజనం జరుగుతుంది. 20వ తేదీ రాత్రి అమ్మవారికి గజవాహనం, 21న రాత్రి గరుడ వాహనసేవ నిర్వహిస్తారు. తెప్పోత్సవాల అనంతరం రోజూ రాత్రి తిరువీధుల్లో అమ్మవారు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులను కటాక్షించనున్నారు.

### ఆర్జిత సేవలు రద్దు

తెప్పోత్సవాల కారణంగా ఆలయంలో ఐదు రోజుల పాటు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, 21న లక్ష్మీపూజను రద్దు చేశారు.

### ముస్తాబైన పుష్కరిణి

ఇప్పటికే అమ్మవారి పుష్కరిణిని ముస్తాబు చేశారు. పాతనీటిని తొలగించి.. స్వచ్ఛమైన నీటితో నింపారు. చుట్టూ విద్యుత్‌దీపాలంకరణ చేపట్టారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్ ఆధ్వర్యంలో శనివారం పుష్కరిణిలో తెప్పలపై ట్రయల్ రన్ నిర్వహించారు.


పుష్కరిణిలో తెప్పలపై ట్రయల్ రన్ నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ శాఖ అధికారులు

# రుయాలో 'ఫోర్జరీ'లు ఆగవా?

## తన సంతకం ఫోర్జరీ చేశారంటూ డీఎంఈకి సీఎస్ఆర్ఎంవో ఫిర్యాదు

తిరుపతి(వైద్యం), జూన్ 15: రుయాస్పత్రిలో అధికారుల సంతకాలు ఫోర్జరీ చేయడం ఆగడం లేదు. గతంలో మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ సర్టిఫికెట్ కోసం కొందరు సిబ్బంది ఏకంగా సూపరింటెండెంట్ సంతకాన్నే ఫోర్జరీ చేసిన విషయం తెలిసిందే. అలాగే ఆరోగ్యశ్రీలో కొందరు డేటా ఎంట్రీ ఆపరేటర్లు అయితే వైద్యాధికారులు సంతకాలు ఫోర్జరీ చేసి ఆస్పత్రిలో వైద్యం పొందని రోగుల పేరుతో రూ.లక్షలు స్వాహా చేసిన విషయం వెలుగులోకి రావడం విదితమే. తాజాగా సీఎస్ఆర్ఎంవో తన సంతకాన్ని కొందరు అధికారుల సాయంతో పారిశుధ్య ఏజన్సీలో పనిచేసే వ్యక్తి ఫోర్జరీ చేసి నాలుగు నెలల బిల్లులను మంజూరు చేసుకున్నారని డీఎంఈకి లక్ష్మా నాయక్ ఫిర్యాదు చేశారు. రుయాస్పత్రిలో ఏజన్సీ నిర్వహణ బాధ్యతలు చూస్తున్న ఏ-1 సర్వీస్‌కు నెలకు రూ.50లక్షలకుపైగా బిల్లులు మంజూరు చేస్తారు. రోజూ పారిశుధ్య ఏజన్సీ పనితీరును పరిశీలించి.. నెలాఖరులో అడ్మిన్, హెల్త్ సూపర్‌వైజర్, సీఎస్ ఆర్ఎంవోలు మార్కులు వేస్తారు. ఈ మార్కుల ఆధారంగానే బిల్లులు చెల్లిస్తారు. ఈ క్రమంలోనే గత ఏడాది మార్చి నుంచి జూన్ వరకు ఏజన్సీ పనితీరు బాగాలేదని, దానికి సంబంధించి బిల్లులు కొంత కాలం పెండింగ్‌లో పెట్టారు. దాంతో ఆ ఏజన్సీలో పనిచేసే మేనేజరు రాజేష్ అనే వ్యక్తి ఈ నాలుగు నెలలకు సంబంధించి తన సంతకాన్ని ఫోర్జరీ చేసి బిల్లులు మంజూరు చేయించుకున్నాడని లక్ష్మానాయక్ ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనివెనుక రుయాస్పత్రిలోని కొందరు అధికారుల ప్రమేయం కూడా ఉందన్నారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో ఈ అంశంపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్లు వివరించారు. పైగా ఈ విషయంపై రుయా అధికారులను ప్రశ్నిస్తే.. తప్పుడు ఆరోపణలతో తనను సరెండర్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారిస్తే నిజానిజాలు వెలుగులోకి వస్తాయన్నారు.

# బహిరంగ మద్యపానంపై పోలీసుల ఉక్కుపాదం

తిరుపతి(నేరవిభాగం), జూన్ 15 : తిరుపతిలో బహిరంగ మద్యపానంపై ఉక్కుపాదం మోపాలన్న ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశాలతో రెండు రోజులుగా నగరంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. పార్కింగ్ ప్రాంతాలు, దాబాలు, కూల్ డ్రింక్ షాపులు, కొన్ని కాకా హోటళ్లలో నిత్యం మద్యసేవనం జరుగుతోందని ఎస్పీ దృష్టికి వెళ్లింది. ప్రధానంగా మంగళం రోడ్డు, లీలామహల్ రోడ్డు, తిలక్‌రోడ్డు, కేటీ రోడ్డు, కపిలతీర్థం సర్కిల్ ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం తాగుతున్నా ఎక్సైజ్ అధికారులు కానీ, పోలీసులు కానీ స్పందించి కేసులు నమోదు చేసిన దాఖలాలు లేవు. ముఖ్యంగా శ్రీదేవి కాంప్లెక్సు ఎదుట మందుబాబులు మద్యం దుకాణం ఎదుటే మందు సేవించి కొట్లాటలకు దిగుతున్న సందర్భాలున్నాయి. తాజాగా శుక్రవారం రాత్రి ఆటోనగర్‌లో మందు సేవించి గొడవలకు దిగి ఐదుగురు రౌడీలు కలసి స్నేహితుడినే హతమార్చారు. ఇలాంటి ఘటనల్లో నిందితులను అరెస్టు చేయడం తప్ప బహిరంగ మద్యపానంపై ఉక్కుపాదం మోపిన దాఖలాలు లేవు. ఇటీవల ట్రాఫిక్ నియంత్రణపై పర్యటించిన ప్పుడు మందుబాబుల ఆగడాలను ఎస్పీ గమనించారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్టాండు వద్ద వున్న రెండు బార్ల వద్ద నిత్యం ఘర్షణలు జరుగుతున్న విషయం కూడా ఎస్పీ దృష్టికి వెళ్ళింది. దీనిపై కూడా చర్యలు తీసుకుని మందుబాబులను అరెస్టు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో రెండు రోజులుగా తిరుపతిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు.సీఐలు సిబ్బందిని వెంట పెట్టుకుని సాయంత్రం పూట రోడ్లపైకి వస్తున్నారు. పచ్చ చొక్కాలు వేసుకుని చేతిలో గన్‌లు పెట్టుకుని రోడ్లపై కనిపిస్తుండడంతో మందుబాబులు సైతం భయపడుతున్నారు.


తనిఖీలు చేస్తున్న పోలీసులు

### రెండు రోజుల వ్యవధిలో 200మందికి కౌన్సెలింగ్

ఈ రెండు రోజుల వ్యవధిలో తిరుపతిలో బహిరంగ మద్యపానం చేస్తున్న 200 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. మళ్ళీ రోడ్లు, దాబాలు, హోటళ్ళలో మద్యం సేవించి కనపడితే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామని హెచ్చరించి పంపుతున్నారు.

# ఆ అధికారుల్లో గుబులు

## వైసీపీ వీరవిధేయుల్లో మొదలైన ఆందోళన

తిరుపతి(నేరవిభాగం), జూన్ 15 : వైసీపీ ప్రజా ప్రతినిధులతో అంటకాగిన పోలీసు అధికారుల్లో గుబులు పెరుగుతోంది.ప్రభుత్వం మారడంతో టీడీపీ నాయకులను ప్రసన్నం చేసుకుని మంచి పోస్టింగ్ కోసం ప్రయత్నాలు చేసుకుంటున్నారు.తిరుపతిలో శాంతి భద్రతల విభాగంలో పనిచేస్తున్న ఓ సీఐ ఎలాగైనా తిరుపతిలోనే పోస్టింగ్ దక్కించుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. అదే స్టేషన్‌లో సబ్ డివిజన్ అధికారి సైతం తిరుపతిలోనే వుండేందుకు, కాదంటే కనీసం చంద్రగిరి సబ్ డివిజన్‌కైనా పోస్టింగ్ వేయించుకునే పనిలో వున్నారు. దీనికోసం టీడీపీలో కీలకంగా వ్యవహరిస్తున్న ఒక ప్రజా ప్రతినిధి ద్వారా పావులు కదుపుతున్నట్లు సమాచారం.తిరుచానూరు సీఐ బదిలీ కోసం అక్కడున్న నాయకుడు డీఐజీ స్థాయిలో ఫిర్యాదు చేశాడు.తిరుమల1,2 సర్కిళ్ళు సత్యవేడు, శ్రీకాళహస్తి, బుచ్చినాయుడు కండిగ, తిరుపతి ఈస్ట్, వెస్ట్, యూనివర్శిటీ, ఎంఆర్‌పల్లి స్టేషన్లలో పనిచేస్తున్న వారిపై సైతం బదిలీ వేటు తప్పదని అంచనా వేస్తున్నారు. వైసీపీ పాలనలో విపక్షకు గురై పీటీసీ, డీసీఆర్‌బీ, సీఐడీ, ఇంటెలిజెన్సు విభాగాలకు పరిమితమైన అధికారులకు మంచి పోస్టింగులు ఇవ్వాలనే ఆలోచనలో అధికార పార్టీ నాయకులున్నట్లు సమాచారం.

# దార్శనికుడు శ్రీశ్రీ

తిరుపతి (కల్చరల్), జూన్ 15: మహాకవి శ్రీశ్రీ ఎంతో దార్శనికత కలిగిన కవి అని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. శనివారం యశోద నగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఈతరం కవితా వేదిక, వేమన విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా శ్రీశ్రీ వర్ధంతి సభ నిర్వహించాయి. తొలుత నిర్వాహకులు శ్రీశ్రీ చిత్ర పటానికి పూల మాలలు వేసి, నివాళి అర్పించారు. సభకు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా, ప్రధాన వక్తగా విచ్చేసిన గరికపాటి రమేష్ శ్రీశ్రీ కవిత్వ విశ్లేషణ చేశారు. టెంకాయల దామోదరం, ఓ.వెంకటరమణ, మల్లారపు నాగార్జున, నడ్డి నారాయణ ప్రసంగించారు. శ్వేత పూర్వ సంచాలకుడు భూమన్, తిరుపతి జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు సాకం నాగరాజు, కథా రచయిత పేరూరు బాలసుబ్రమణ్యం, తమటం రామచంద్రారెడ్డి, ఆకుల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కాగా, తిరుపతికి చెందిన రాయలసీమ రంగస్థలి కళాకారులు కూడా శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. గుండాల గోపీనాథ్‌రెడ్డి, శాంబోలు హరనాథ్, తిరుపతి అర్బన్ బ్రాహ్మణ సేవా సమితి కార్యదర్శి శేషగిరిరావు, టీడీపీ లీగల్ సెల్ నేత దినకర్, పీఆర్ఎల్ కుమార్, చిత్రపు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.


వేమన విజ్ఞాన కేంద్రంలో శ్రీశ్రీకి నివాళి

# సమన్యాయం చేయాలి

## ఐఎన్‌టీయూసీ

తిరుపతి అర్బన్, జూన్ 15: అన్నివర్గాల వారికి సమన్యాయం చేయాలని ఎన్డీఏ కూటమి ప్రభుత్వాన్ని ఐఎన్‌టీయూసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రత్నకుమార్ కోరారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో సంఘటిత, అసంఘటిత కార్మికులంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అఖండ మెజారిటీతో గెలుపొంది అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. ఈఎస్ఐ ఆస్పత్రిని 100 పడకలకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగసంస్థల ప్రైవేటీకరణపై పోరాటాలను కొనసాగిస్తామని, కేంద్రానికి సహకరించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఐఎన్‌టీయూసీ ఉమ్మడి జిల్లా ప్రధాన మురళీధర్, ఉపాధ్యక్షుడు షఫీఉల్లా, కార్యదర్శి రంజిత్, కోశాధికారి శ్రీనివాసులు, అనూష తదితరులు పాల్గొన్నారు.


జయశ్రీ | సాయిశ్రీ | యోజిత | హేమంత్

# గురుకుల పాఠశాలకు నలుగురి ఎంపిక

పాకాల, జూన్ 15: దేశిరెడ్డిపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నలుగురు చిన్నారులు ప్రభుత్వ గురుకుల పాఠశాలలో ప్రవేశానికి ఎంపికయ్యారు. నాలుగవ తరగతి బాలికలు జ్యోతిక, సాయిశ్రీ, జయశ్రీలు పీలేరు బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశానికి అర్హత సాధించారు. అదే పాఠశాల విద్యార్థి హేమంత్ కడప బాలుర గురుకుల పాఠశాలకు ఎంపికయ్యాడు. ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ ఇచ్చిన ప్రత్యేక శిక్షణతో వీరు గురుకుల పాఠశాలలో ప్రవేశం సాధించారని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

# డాక్టరేట్ ప్రదానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 15: పద్మావతి మహిళా యూనివర్సిటీ ఫార్మసీ స్కాలర్ బి. ఉమారాజేశ్వరి డాక్టరేట్ పొందారు. డిజైన్ అండ్ ఎవల్యూషన్ ఆఫ్ నావెల్ థెరపిక్ ఏజెంట్స్ ఫ్రం నేచురల్ ఆక్సిడోరేడక్టేస్ అంశంలో ప్రొఫెసర్ జ్యోష్నారాణి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు.


ఉమారాజేశ్వరి

# భక్తజనసంద్రంగా ముక్కంటి ఆలయం

శ్రీకాళహస్తి, జూన్ 15: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం భక్తజన సంద్రంగా మారింది. వారాంతపు సెలవులు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 30వేలమంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించు కున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇందులో రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 2,046మంది, రూ.50 టిక్కెట్ల ద్వారా 2,859 మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 టిక్కెట్ల ద్వారా 2,662మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,011, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 328మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 245మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 72మంది భక్తులు రాహుకేతు పూజలు చేయించుకున్నారు.



# వేటకు వెళ్లిన మత్స్యకారులు

కోట, జూన్ 15 : మండల పరిధిలోని మత్స్య కారులు 61 రోజుల విరా మం తరువాత శని వారం చేపలు పట్టుకునేందుకు సముద్రంలోకి వెళ్లారు. కుల, ఇష్టదైవమైన గంగమ్మకు శాస్త్రోకతంగా పూజలు నిర్వహించి వేటకు బయ ల్దేరారు. కోట, వాకాడు, చిల్లకూరు మండలాలలోని 1800 మంది మత్స్యకారులు బోట్లలో వలలతో చేపల వేటకు వెళ్లారు. ఆయా మత్స్యకారులను కుటుంబ సభ్యులు దీవించి సురక్షితంగా వెళ్లి రావాలని ఆశీర్వదించారు.

# సచివాలయాల్లో చంద్రబాబు ఫొటోలు



మంగళం, జూన్ 15: మంగళం పరిధిలోని సప్తగిరి, రణధీరపురం, మంగళం, తిరుమలనగర్ పంచాయతీల్లోని సచివాలయాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటోలను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే ఆయాశాఖల మంత్రులతోపాటు స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని ఫొటోలను కూడా పెడుతున్నారు. ఈ పనులను టీడీపీ నాయకులు పాలముంతల సుబ్బుయాదవ్, జడరెడ్డి భాస్కర్‌రెడ్డి, అల్లాబాషా, సురేష్‌నాయుడు, గోపాల్‌యాదవ్, వెంటకరామిరెడ్డి, రవి, గోపి, రవికుమార్, శశి పర్యవేక్షించారు.

# టీడీపీ విజయంతో తిరుమలకు పాదయాత్ర


తిరుమలకు బయల్దేరిన ఊటువంక గ్రామస్తులు

పాకాల, జూన్ 15: టీడీపీ విజయం సాధించడం, చంద్రగిరి నియోజకవర్గంలో పులివర్తి నాని ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలుపొందడంపై దామలచెరువు పంచాయతీ ఊటువంక గ్రామస్తులు శనివారం తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ విజయం సాధిస్తే కాలినడకన తిరుమలకు వస్తామని తాము మొక్కుకున్నట్లు చెప్పారు. గ్రామస్తులు బీనరసింహులు, శ్రీరాములు, తులసి, జయరాం, సుబ్బయ్య, శ్రీనివాసులు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

**చంద్రగిరి:** శ్రీనివాస మంగాపురానికి ఊటువంక గ్రామస్తుల పాదయాత్ర చేరుకోగానే వారికి ఎమ్మెల్యే పులివర్తి నాని భోజన ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే సతీమణి పులివర్తి సుధారెడ్డి వారితో మాట్లాడి.. స్వయంగా భోజనం వడ్డించారు. వీరు ఆదివారం ఉదయం శ్రీవారిమెట్టు మార్గంలో తిరుమలకు వెళ్లి శ్రీవారిని దర్శించుకోనున్నారు.


భోజనం వడ్డిస్తున్న పులివర్తి సుధారెడ్డి

# చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించండి

పాకాల, జూన్ 15: చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కార్యకర్తలు కోరారు. దామలచెరువు సెక్టారు మొగరాల పంచాయతీ శేషాపురంలో శనివారం అంగన్వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్తలు కెభారతి చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను తమ కేంద్రాల్లో చేర్పాలని కోరారు. మొగరాల అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్యకర్తలు షమీమ్, పుష్పలత, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. దామలచెరువు హైస్కూల్‌లో బేటీ బచావో బేటీ బడావో కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ జి.కృష్ణవేణి, ఉపాధ్యాయులు హేమలత, శిరీష, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# తుమ్మలగుంటలో అంకాళమ్మ జాతర

తిరుపతి రూరల్, జూన్ 15: తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట గ్రామ హరిజనవాడలో శనివారం అంకాళ పరమేశ్వరి అమ్మవారి జాతరని వేడుకగా నిర్వహించారు. గ్రామానికి చెందిన టీడీపీ జిల్లా ప్రచార కార్యదర్శి దొడ్ల కరుణాకర్‌రెడ్డి అమ్మవారికి పసుపు, కుంకుమ, పట్టువస్త్రాలతో సారె సమర్పించి.. మొక్కు చెల్లించారు. టీడీపీ నాయకులు చెంగల్రామానాయుడు, బిరుదాల తులసీరామ్‌రెడ్డి, శ్రీనివాసులురాయల్, భాస్కర్‌రెడ్డి, రేవంత్, ముఖేష్, చంద్రశేఖర్, సుమన్, ముని, శివ తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారికి సారె సమర్పిస్తున్న దొడ్ల కరుణాకర్‌రెడ్డి

# బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న



చంద్రగిరి, జూన్ 15: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకన్న భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 10.30 గంటలకు కల్యాణోత్సవం, సాయంత్రం ఊంజల్ సేవ కన్నులపండువగా నిర్వహించారు. ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారథి, జమేదర్ చిరంజీవి, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణానికి విరాళాలు

చంద్రగిరి, జూన్ 15: మూలస్థాన ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణానికి భక్తులు విరాళాలు అందజేశారు. శనివారం దాసళ్లపల్లెకు చెందిన చిటిపిరాళ్ల చెన్నకేశవులురెడ్డి రూ.1,11,116, ఐతేపల్లెకు చెందిన గొబ్బిళ్ల కన్నయ్య రూ.50,116, దర్శినేని జగదీష్‌ప్రసాద్ రూ.50,116, చంద్రగిరికి చెందిన జయపాల్‌రెడ్డి రూ.50వేలు, పూత్తూరు బాలిరెడ్డి రూ.50,516.. ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డి అందజేశారు. ఈసందర్భంగా దాతలను నిర్వాహకులు సత్కరించారు.



# కళలను కాపాడుకుందాం


కళాకారులతో ప్రసాద్‌స్వామి

రామచంద్రాపురం, జూన్ 15: ప్రాచీన కళలను కాపాడుకుందామని ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రసాద్‌స్వామి అన్నారు. బాదూరు పంచాయతీ వడ్డికాల్వలో 26మంది కోలాట భజన నేర్చుకుని శనివారం గజ్జె పూజ నిర్వహించారు. వీరికి ప్రసాద్‌స్వామి ఆధ్వర్యంలో దుస్తులు అందజేశారు.

# ఉద్యాన పంటలపై రైతులు ఆసక్తి చూపాలి

చంద్రగిరి, జూన్ 15: ఉద్యాన పంటలపై రైతులు ఆసక్తి చూపాలని శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కవిత, ముకుంద లక్ష్మి సూచించారు. తిరుపతి చీనీ, నిమ్మ పరిశోధన కేంద్రం నుంచి శాస్త్రవేత్తలు శనివారం మండలంలోని దోర్నకంబాల, గంగుడుపల్లెలో క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి, రైతులకు అవగాహన కల్పించారు. మామిడి పంటకు బదులుగా ఇక్కడ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా చీనీ, నిమ్మ, ఉసిరి, జామ వంటి పంటలపై దృష్టి పెట్టాలని చెప్పారు. ఉద్యానశాఖాధికారి శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

# సీహెచ్‌సీ సేవలు సద్వినియోగం చేసుకోండి

చంద్రగిరి, జూన్ 15: చంద్రగిరిలోని సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ కోరారు. శనివారం ఆస్పత్రిలో మీడియాతో మాట్లాడుతూ.. ఇక్కడ 50 పడకలకు సరిపడా వైద్యులు, సిబ్బంది ఉన్నారని చెప్పారు. రోగులకు మెరుగైన సేవలు అందించడానికి అన్ని సౌకర్యాలు, వైద్య పరికరాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే పులివర్తి నానికి అభినందనల వెల్లువ


నానితో మాట్లాడుతున్న అధికారులు

తిరుచానూరు, జూన్ 15: చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిని శనివారం పలుశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి అభినందనలు తెలిపారు. తిరుపతి రూరల్ మండలంలోని రఘునాథ్ రిసార్ట్స్‌లోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యేని పోలీసు, రెవెన్యూ, పంచాయతీ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి.. పుష్పగుచ్ఛాలు, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజా పాలన టీడీపీతోనే సాధ్యం


శ్రీవారి మెట్టు వద్ద పూజలు చేస్తున్న తెలుగు తమ్ముళ్లు

చంద్రగిరి, జూన్ 15: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ప్రజాపాలన మొదలైందని వి.కోట టీడీపీ మండల అధ్యక్షుడు రంగనాథ్ అన్నారు. వి.కోట మండలం తోటకనుమకు చెందిన టీడీపీ శ్రేణులు 50 మంది తిరుమలకు చేపట్టిన పాదయాత్ర శనివారం శ్రీవారి మెట్టు వద్దకు చేరింది. అక్కడ ప్రత్యేక పూజలు చేసి తిరుమలకు కాలినడక కొనసాగించారు. అనంతరం తిరుమలలో తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, నందకుమార్, నరేష్, కార్తీక్, శివ, మోహనచారి, వరదప్ప, మల్లికార్జున, ఉదయ్‌కుమార్, శంకరప్ప, నారాయణ, గుర్రప్ప, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీనారాయణస్వామి సేవలో మహారాష్ట్ర గవర్నర్

రామచంద్రాపురం, జూన్ 15: రామాపురం బ్రహర్షి పీఠంలో వెలసిన లక్ష్మీనారాయణస్వామిని మహారాష్ట్ర గవర్నర్ రమేష్ బైస్ శనివారం దర్శించుకున్నారు. ఈయనకు పీఠం నిర్వాహకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి అమ్మవార్ల దర్శనానంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. పీఠం నిర్వాహకులు, తహసీల్దారు ఉషారాణి పాల్గొన్నారు.


గవర్నర్ రమేష్ బైస్‌కి స్వాగతం పలుకుతున్న బ్రహ్మర్షిపీఠం నిర్వాహకులు

# మాజీ ఎమ్మెల్యేకి శుభాకాంక్షలు



తిరుపతి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మాజీ ఎమ్మెల్యే మోహన్ జన్మదినం సందర్భంగా శనివారం పెద్దఎత్తున పార్టీ నాయకులు, అభిమానులు ఆయన నివాసానికి వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టీడీపీ నాయకులు నరసింహ యాదవ్, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, ఊకా విజయకుమార్, పులుగోరు మురళీ, మస్తాన్ నాయుడు, ఎస్వీఎం శ్రీధర్, సుబ్బు యాదవ్ తదితరులు ఉన్నారు.

# ముగిసిన తిరుపతి సిరి సంత

తిరుపతి (కల్చరల్), జూన్ 15: నాబార్డు సహకారంతో కనెక్ట్ టూ ఫార్మర్ సంస్థ మూడ్రోజులుగా మహతి కళాక్షేత్రం వేదికగా నిర్వహించిన తరంగ్ (తిరుపతి సిరి సంత) కార్యక్రమం శనివారం ముగిసింది. రైతులు, చేనేత కార్మికులు తమ ఉత్పత్తులను సుమారు 40 స్టాల్స్‌లో ప్రదర్శించారు. ప్రకృతి సేద్యం ద్వారా పండిన కూరగాయలు, మామిడి, నేరేడు, బొప్పాయి, కర్బూజ, అరటి వంటి పండ్లు, ఆకుకూరలు, స్వచ్ఛమైన తేనె, వివిధ రకాల పప్పుధాన్యాలు, మేలు రకం కాకర, దొండ, బీర మొక్కలు సందర్శకులను విశేషంగా ఆకర్షించాయి. శనివారం డాక్టర్ కె.రామచంద్ర.. ప్రకృతి చికిత్స గురించి ప్రసంగించారు. అనంతరం యువత ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



# మహిళా వర్సిటీ వీసీకి ఏడాది పాలన పూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 15: పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ భారతి ఏడాది పాలనా కాలాన్ని పూర్తి చేసుకున్నారు. దాంతో శనివారం ఆమెను పలువురు టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు సత్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. పీఎం ఉష పథకం ద్వారా రూ.100 కోట్ల నిధులను వర్సిటీకి తీసుకురాగలగడం, సౌత్ జోన్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహణ, పలు దేశాల పర్యటన, మూడు ప్రతిష్ఠాత్మక సంస్థలతో ఒప్పందాలు సంతోషాన్నిచ్చాయని చెప్పారు. ఆగస్టులో 13 దేశాల ప్రతినిధులతో యూనివర్సిటీ వేదికగా అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. తనకు సహకరిస్తున్న విద్యార్థులు, ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు.


వీసీ భారతిని సత్కరిస్తున్న ఉద్యోగులు



ఎస్వీ జూనియర్ కళాశాలలో సుమన్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

సినీ రంగంలోని వారు రాజకీయాల్లోనూ రాణించగలరని పవన్ కల్యాణ్ మరోసారి నిరూపించారని తెలిపారు. ఉప ముఖ్యమంత్రిగా ప్రజలకు నిరంతరం సేవ చేస్తారని తాను నమ్ముతున్నట్టు చెప్పారు. ఐదేళ్ల కాలంలో రాష్ట్రం ఏ మాత్రం అభివృద్ధి చెందలేదన్నారు. చంద్రబాబు చేస్తున్న అభివృద్ధికి అడ్డుపడకుండా ప్రోత్సహించాలని వైసీపీకి విజ్ఞప్తి చేశారు. పలువురు విద్యార్థులు, ఉద్యోగులు, నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్రాన్ని బాగు చేయగలిగేది చంద్రబాబే

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 15: మన రాష్ట్రాన్ని బాగు చేయగలిగిన వ్యక్తి చంద్రబాబు ఒక్కరే అని ప్రముఖ సినీ నటుడు సుమన్ అభిప్రాయపడ్డారు. బీసీ విద్యార్థి నాయకుడు నారాయణగౌడ్ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనేందుకు శనివారం ఎస్వీయూనివర్సిటీకి సుమన్ వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర రాజధాని అమరావతి అని గర్వంగా చెప్పుకునే రోజు వస్తుందని అన్నారు. చంద్రబాబు పాలన చేస్తున్నారంటే ప్రపంచ దేశాలు సైతం మన రాష్ట్రం వైపు చూసే పరిస్థితి ఉంటుందన్నారు.

**ఎస్వీ జూనియర్ కళాశాలలో..**

**తిరుపతి(విద్య):** ప్రముఖ సినీనటుడు సుమన్ ఎస్వీ జూనియర్ కళాశాలను శనివారం సందర్శించారు. ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించడంపై ప్రిన్సిపాల్ ప్రకాష్‌బాబు, అధ్యాపకులను అభినందించారు. ప్రవేశాల కోసం కళాశాలకు వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సుమన్ మాట్లాడారు. టీటీడీ కళాశాలల్లో విద్యనభ్యసించడం పూర్వజన్మ సుకృతమని చెప్పారు. అనంతరం సుమన్‌ను ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది సన్మానించారు.

## జగన్ నటనకు ఆస్కార్ ఇవ్వాల్సిందే

తెలుగు యువత

తిరుపతి అర్బన్, జూన్ 15: ఓటమిని అంగీకరించక మాజీ సీఎం జగన్ నిస్సిగ్గుగా నటిస్తున్నారని, దానికి ఆస్కార్ అవార్డు ఇవ్వాల్సిందేనని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు అన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. జగన్ వంద శిశుపాళ్లతో సమానమన్నారు. సీఎం చంద్రబాబును ఏకవచనంతో సంబోధించే అర్హత ఆయనకు లేదన్నారు. మరోసారి పునరావృతమైతే తాడేపల్లి ప్యాలెస్‌ను ముట్టడించి.. అక్కడినుంచి తరిమికొడతామని హెచ్చరించారు. ఏ ముఖం పెట్టుకుని జనాల్లో వస్తారని, ఒకవేళ వస్తే వైసీపీ కార్యకర్తలే తరిమికొడతారని చెప్పారు. ఇప్పటికే పుంగనూరులో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని అడ్డుకున్నారని గుర్తుచేశారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గించేందుకు జగన్ చూస్తున్నారని ఆరోపించారు. ఐదేళ్లలో ప్రత్యేక హోదా ఊసెత్తని ఆయన ఇప్పుడు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. అభివృద్ధి ఆయనకు గిట్టదని, జీవితాంతం జైల్లో పెడితే రాష్ట్రం బాగు పడుతుందని అభిప్రాయపడ్డారు. తొలిరోజు నుంచే చంద్రబాబు తన మార్కు పరిపాలన చూపిస్తున్నారంటూ ప్రజలు కొనియాడుతున్నారన్నారు. యువనేత లోకేశ్‌కు విద్యాశాఖ కేటాయించడం శుభపరిణామమన్నారు. విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. రోజా అవినీతి బాగోతాన్ని బయటపెడతామని, ఆమె జైలుకెళ్లడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కంకణాల రజనీకాంత్, తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు కృష్ణ యాదవ్, నేతలు శ్రీనివాసులు, వాసుదేవ్, శ్రీనివాస్ యాదవ్, శ్రీరామ్‌బాబి, వెంకటేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న రవినాయుడు



తిరుపతి మాజీ ఎమ్మెల్యే మోహన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సినీ నటుడు సుమన్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తదితరులు

### శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.71 కోట్లు

తిరుమల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.71 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 66,782 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 36,229 మంది తలనీలాలు సమర్పించారు.

## టీటీడీ, నగరపాలక సంస్థ నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ : టీడీపీ



మీడియాతో మాట్లాడుతున్న నరసింహ యాదవ్

తిరుపతి అర్బన్, జూన్ 15: టీటీడీ, నగరపాలక సంస్థలో నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపిస్తామని టీడీపీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహయాదవ్ అన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. వ్యక్తిగత కక్షలకు తావు లేకుండా చట్టం ప్రకారం తప్పు చేసినవారికి శిక్ష తప్పదన్నారు. తిరుమల నుంచే చంద్రబాబు ప్రక్షాళన మొదలుపెట్టారని అందుకు ధర్మారెడ్డిని పదవి నుంచి తప్పించడమే నిదర్శనమన్నారు. టీటీడీ చైర్మన్ రాజీనామా చేసినా సభ్యులు కొనసాగుతుండడాన్ని తప్పుబట్టారు. ప్రధాన అవసరాలను దృష్టిలో ఉంచుకుని హామీలను నెరవేరుస్తారని తెలిపారు. తిరుపతిలో కూడా అనేక అభివృద్ధి పనులు ఎదురుచూస్తున్నాయని, త్వరలోనే ఊపందుకుంటాయని చెప్పారు. ఈ సమావేశంలో టీడీపీ సీనియర్ నేతలు ఊకా విజయ్‌కుమార్, చేజర్ల మనోహరాచారి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ పండుగకు ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగకు అవసరమైన ఏర్పాట్లు ఎస్వీయూ సమీపంలోని ఈద్గా మైదానంలో ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ ఏర్పాట్లను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శనివారం పరిశీలించారు. ముస్లిం సోదరులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు ఈద్గా మైదానం స్థలం రైల్వేశాఖతో ఉన్న ఇబ్బందిని ఎమ్మెల్యే దృష్టికి నాయకులు తీసుకొచ్చారు. పవన్, చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామన్నారు. ఈకార్యక్రమంలో ముస్లిం నాయకులు మహబూబ్ బాషా, రఫీ, హరున్ బాషా, ఆలీబాషా, జనసేన నాయకులు అబ్బులు, ముస్లిం జేఏసీ చైర్మన్ ముర్తాజ పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేకి సన్మానం



తిరుపతి (జీవకోన), జూన్ 15: ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును తూనికలు కొలతలశాఖ డిప్యూటీ కంట్రోలర్ జి.సుబ్బారెడ్డి, అసిస్టెంట్ కంట్రోలర్ ఎన్‌స్వామి, ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వర్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం సన్మానించారు. మహేశ్వరరావు పాల్గొన్నారు.

## వాయిదాపడ్డ డిగ్రీ 2, 4 సెమిస్టర్ పరీక్షలు 18న

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 15: ఎస్వీయూనివర్సిటీ పరిధిలో ఈనెల 12వ తేదీన నిర్వహించాల్సిన డిగ్రీ 2, 4వ సెమిస్టర్ పరీక్షలు వాయిదా పడిన విషయం తెలిసిందే. అదే రోజు యూజీసీ నెట్ పరీక్షలు నిర్వహించనున్న కారణంగా ఈ పరీక్షలు వాయిదా పడ్డాయి. వాయిదా పడిన పరీక్షలు ఈనెల 18వ తేదీ నిర్వహించనున్నట్టు వర్సిటీ పరీక్షల అధికారి దామ్లా నాయక్ వెల్లడించారు.

**11 మంది డీబార్ :** డిగ్రీ 2, 4 వ సెమిస్టర్ పరీక్షల్లో 11 మంది విద్యార్థులు డీబార్ అయ్యారు. శనివారం పలు కేంద్రాల్లో నిర్వహిస్తున్న పరీక్షలను హైపవర్ కమిటీ పర్యవేక్షించింది. ఈ సమయంలో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న 11 మంది విద్యార్థులను గుర్తించి డీబార్ చేశారు. తిరుపతి, చిత్తూరుల్లో నలుగురు చొప్పున, మదనపల్లెలో ముగ్గురిని డీబార్ చేసినట్టు దామ్లానాయక్ తెలిపారు.

## నైపుణ్యంతో పనిచేయాలి

### ఎస్బీ సిబ్బందికి ఎస్పీ ఆదేశం



ఎస్బీ సిబ్బందితో సమావేశమైన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 15: స్పెషల్ బ్రాంచి (ఎస్బీ) సిబ్బంది నైపుణ్యంతో పనిచేయాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. పోలీసు అతిథి గృహంలో శనివారం ఎస్బీ పోలీసులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. సమాచారాన్ని అధికారులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. రోజూ అసాంఘిక శక్తుల ఆటలకు అడ్డుకట్ట వేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్స్, బైండోవర్ చేసిన వారిపై నిరంతర నిఘా ఉంచాలని చెప్పారు. జాబ్, పాస్‌పోర్టు వెరిఫికేషన్ నిక్కచ్చిగా వ్యవహరించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. అదనపు ఎస్పీలు విమల కుమారి, ఎస్బీ డీఎస్పీ వెంకటాద్రి, సీఐ విశ్వనాథ చౌదరి, ఎస్ఐ ప్రదీప్ రెడ్డి పాల్గొన్నారు.

## టీటీడీలో అధర్మపాలన అంతమైంది

### బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి

తిరుపతి (జీవకోన), జూన్ 15: టీటీడీలో అధర్మపాలన అంతమైందని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. టీటీడీలో అర్హత లేకపోయినా సకల శాఖల అధికారిగా ఫుల్ అడిషనల్ చార్జ్ ఈవోగా పెత్తనం చెలాయించిన ధర్మారెడ్డిని తొలగించి సీనియర్ ఐఏఎస్ అధికారి శ్యామలరావును ఎన్డీయే ప్రభుత్వం ఈవోగా నియమించడం హర్షణీయమని తెలిపారు. సీఎంగా బాధ్యతలు చేపట్టి శ్రీవారి దర్శనానికి వచ్చిన చంద్రబాబు.. తిరుమల నుంచి ప్రక్షాళన ప్రారంభిస్తామని చెప్పిన 24 గంటల్లోనే ధర్మారెడ్డిని ఎఫ్ఏసీ ఈవో నుంచి రివర్షన్ ఇవ్వడం దైవానుగ్రహం అన్నారు. మాజీ సీఎం జగన్ అండతో నియంతలా వ్యవహరించిన ధర్మారెడ్డి తగిన మూల్యం చెల్లించుకున్నారన్నారు. ఇక పార్వేట మండపాన్ని ఎవరి అనుమతితో కూల్చారని? దీనికి బాధ్యులైన వారిపై రాష్ట్రపతి, ప్రధానమంత్రి, ముఖ్యమంత్రికి లేఖ రాస్తున్నట్లు తెలిపారు.

### ఘనంగా నారాయణ జన్మదినం



తిరుపతి(విద్య), జూన్ 15: రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి, నారాయణ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు పొంగూరు నారాయణ జన్మదిన వేడులను శనివారం తిరుపతిలో ఘనంగా నిర్వహించారు. బాలాజీ కాలనీలోని నారాయణ కళాశాలలో డీజీఎం కొండలరావుతోపాటు అధ్యాపకులు, సిబ్బంది కేక్ కట్‌చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల సిబ్బంది రక్తదానం చేశారు. అనంతరం అనాథ బాలలకు, రుయాస్పత్రి వెలుపల రోగుల సహాయకులు, ఇతరులకు అన్నదానం చేశారు.

### భోగశ్రీనివాసమూర్తికి నేడు ప్రత్యేక సహస్ర కలశాభిషేకం

తిరుమల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలోని భోగ శ్రీనివాసమూర్తికి ఆదివారం ప్రత్యేక సహస్ర కలశాభిషేకం జరగనుంది. 18 ఏళ్లుగా శ్రీవారి ఆలయంలో టీటీడీ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ఉదయం ఆరు నుంచి 8.30 గంటల వరకు శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి వద్ద భోగశ్రీనివాసమూర్తికి అర్చకస్వాములు ఏకాంతంగా సహస్ర కలశాభిషేకం నిర్వహిస్తారు.

### ఆరుగురు కానిస్టేబుళ్లకు పదోన్నతి

తిరుపతి(నేరవిభాగం), జూన్ 15: జిల్లాలో పనిచేస్తున్న ఆరుగురు కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి కల్పిస్తూ ఎస్పీ హర్షవర్ధన్ రాజు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన వారిలో అలిపిరిలో పనిచేస్తున్న టి.సురేష్‌రెడ్డి, కమాండ్ కంట్రోల్ యూనిట్‌లోజూట గంగరాజు, తిరుచానూరులోని డి.మునిరత్నం, తిరుమల వన్‌టౌన్‌లోని ఎస్.హరిహరన్, అలిపిరిలోని రామలింగం నాయుడు, రైల్వేలోని సిద్ధయ్య ఉన్నారు. వీరందరికీ రెండు, మూడ్రోజుల్లో పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వనున్నారు. మరోవైపు ప్రస్తుతం హెడ్ కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న మరో ఐదుగురికి ఏఎస్ఐలుగా పదోన్నతులు రానున్నాయి.

### తిరుమలేశుడి సేవలో ప్రముఖులు



సీవీ భాస్కర రెడ్డి - జస్టిస్ నాగార్జున్ - కేంద్రమంత్రి కుమారస్వామి

తిరుమల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో.. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీవీ భాస్కర రెడ్డి, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగార్జున్, కేంద్రమంత్రి కుమారస్వామి, టీడీపీ ఎమ్మెల్యేలు గణబాబు, భూమా అఖిలప్రియ, గుమ్మనూరు జయరాం, సినీ నిర్మాత, టీడీపీ నేత అంబికా కృష్ణ, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, తెలంగాణ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, సినీ నటి మంచు లక్ష్మి ఉన్నారు.

### తిరుమల ఘాట్‌లో అదుపుతప్పిన కారు



#### భక్తులు సురక్షితం

తిరుమల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటిఘాట్‌లో శనివారం ఓ కారు అదుతప్పింది. అదృష్టవశాత్తూ అందులోని భక్తులు సురక్షితంగా బయటపడ్డారు. హైదరాబాదుకు చెందిన ఓ కుటుంబం శ్రీవారి దర్శనం పూర్తిచేసుకుని శనివారం మధ్యాహ్నం తమ కారులో తిరుగు ప్రయాణమైంది. అలిపిరి టోల్‌గేట్‌కు సమీపంలో వాహనం అదుపుతప్పి కుడివైపున్న చిన్నపాటి గట్టును ఢీకొంది. ఆపై రోడ్డుపక్కకు దూసుకెళ్లి, ముందున్న ఓ బండరాయిని ఢీకొని ఆగిపోయింది. వాహనంలోని నలుగురు భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

**తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, తిరుపతి ప్రధాన కార్యాలయం**

తిరుపతి కో-అపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, తిరుపతి తేది : 28.03.2024న జరగవలసిన మహాజన సభ సమావేశము ఎన్నికల కోడ్ నిబంధనలు వలన వాయిదా పడిన మహాజన సభ తేది 29.06.2024 శనివారం, ఉ॥ 9.00 గం॥లకు బ్యాంకు ప్రధాన కార్యాలయము, తిరుపతి నందు జరుగునున్నది. కావున 'ఎ' క్లాసు సభ్యులెల్లరు సమావేశమునకు హాజరు కావలసినదిగా కోరడమైనది.

ఇట్లు... మేనేజింగ్ డైరెక్టర్

# చంద్రబాబు హామీపై ప్రజల్లో ఆశలు

**గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలుపుతానని హామీ**

గూడూరు, జూన్ 13: ఎన్నికల ప్రచారం సందర్భంగా గూడూరుకు విచ్చేసిన చంద్రబాబు టీడీపీ అధికారంలోకి రాగానే గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరులో కలుపుతామని హామీ ఇచ్చారు. బుధవారం చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన నేపథ్యంలో గూడూరు నియోజకవర్గ ప్రజల్లో అయన ఇచ్చిన హామీపై ఆశలు చిగురిస్తున్నాయి. అప్పటి వైసీపీ ప్రభుత్వంలో జిల్లాల పునర్విభజన చేసిన సమయంలో గూడూరు నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో విలీనం చేశారు. దీంతో అప్పట్లో ఈ నిర్ణయంపై ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చింది. నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు జరిగాయి. ప్రధానంగా గూడూరు నుంచి నెల్లూరుకు 35 కిలోమీటర్లు దూరం కావడం, 40 నిమిషాలు మాత్రమే ప్రయాణ సమయం కావడంతో వివిధ పనులపై జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రజలకు కానీ, అటు పలు శాఖల అధికారులుకు సౌకర్యవంతంగా ఉండేది. జిల్లా కేంద్రంలోని ఏ కార్యాలయానికి తమ సమస్యల పరిష్కారానికి ప్రజలు వెళ్లాలన్నా, తక్కువ సమయంతో పాటు తక్కువ బస్సు చార్జీలతో వెళ్లే వెసులుబాటు ఉండేది. జిల్లాల పునర్విభజన అనంతరం గూడూరు నియోజకవర్గాన్ని



ఏప్రిల్ 20న జరిగిన సభలో హామీ ఇస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు

తిరుపతి జిల్లాలో కలిపారు. దీంతో గూడూరు నుంచి తిరుపతికి 100 కిలోమీటర్లు దూరం ఉండడం, ప్రయాణ చార్జీలు నెల్లూరు కంటే ఎక్కువగా ఉండడం, మూడు గంటలకు పైగా సమయం పడుతుండడంతో జిల్లా కేంద్రంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ప్రజలు, అధికారులు అవస్థలు పడాల్సి వస్తోందని ఆవేదన చెందేవారు. దీంతో ఇప్పటి ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఈ విషయాన్ని అప్పట్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏప్రిల్ 20న గూడూరులో నిర్వహించిన చంద్రబాబు సభలో ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో చంద్రబాబు సభావేదిక నుంచి టీడీపీ అధికారంలోకి రాగానే, తాను ముఖ్యమంత్రిని కాగానే గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలుపుతానని ప్రకటించారు. దీంతో సభలో ప్రజలు హర్షధ్వానాలతో చంద్రబాబుకు అభివాదం చేశారు. ఇదే అంశాన్ని యువగళం పాదయాత్రలో నియోజకవర్గంలో పర్యటించిన సమయంలో లోకేశ్ హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ కూడా గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలిపేందుకు కృషి చేస్తానని వెల్లడించి ఉన్నారు. దీంతో గూడూరు నియోజకవర్గ ప్రజలలో సీఎంగా ప్రమాణస్వీకారం చేయనున్న చంద్రబాబు ఇచ్చిన హామీపై ఆశలు చిగురిస్తున్నాయి.

## వేటకు వెళ్లిన మత్స్యకారులు



వలలను పడవల్లోకి చేర్చుకుంటున్న మత్స్యకారులు

కోట, జూన్ 15 : మండల పరిధిలోని మత్స్యకారులు 61 రోజుల విరామం తరువాత శని వారం చేపలు పట్టుకునేందుకు సముద్రంలోకి వెళ్లారు. కుల, ఇష్టదైవమైన గంగమ్మకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి వేటకు బయల్దేరారు. కోట, వాకాడు, చిల్లకూరు మండలాలలోని 1800 మంది మత్స్యకారులు బోట్లలో వలలతో చేపల వేటకు వెళ్లారు. అయా మత్స్యకారులను కుటుంబ సభ్యులు దీవించి సురక్షితంగా వెళ్లి రావాలని ఆశీర్వదించారు. పస్తులతో ఉంటూ వచ్చిన మత్స్యకారులు వేట ప్రారంభం కావడంతో ఆయా మత్స్యకార గ్రామాల్లో ఆనందాలు వెల్లివిరిశాయి.

## కార్మిక, కర్షకులకు అత్యధిక ప్రాధాన్యం

● ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ



విజయశ్రీ, నెలవలను సన్మానిస్తున్న ఎన్ఎంయూ నాయకులు

నాయుడుపేట, జూన్ 15: కూటమిలో కర్షకులకు, దేశ ప్రగతికి తోడ్పాడే కార్మికులకు ప్రాధాన్యం ఉంటుందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట టీడీపీ కార్యాలయంలో శనివారం ఏపీఎస్ ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ తిరుపతి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.శేఖర్, సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో అధ్యక్షుడు డి.పోలయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంను సత్కరించారు. ఆర్టీసీ డిపోల్లో అవసరమైన బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బంది పడు తున్నారన్నారు. తిరుపతి సెక్టార్‌లో హైర్ బస్సులను ప్రవేశపెట్టిన 6 నెలలకే నిలిపివేశారన్నారు. వాటి స్థానంలో కొత్త ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. సూళ్లూరుపేట నుంచి నేరుగా తిరుమల, మదనపల్లి, బెంగళూరు, పలమనేరు, హైదరాబాదులకు సర్వీసులు నడిచేలా చర్యలు తీసుకోవా లన్నారు. అలాగే డిపోల్లో రద్దైన సర్వీసులను పునరుద్ధరించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ నాయకులు హెచ్ వెంకటేశ్వర్లు, ఎన్.శంకరయ్య, కె.ఎస్.మన్యం, ఎస్.కె.షాజహాన్, పి. రమణయ్య, బి.మనోహర్ తదితరులు ఉన్నారు.

## టీడీపీలో మహిళలకు పెద్దపీట

నాయుడుపేట టౌన్, జూన్ 15: టీడీపీ ప్రభుత్వ హయాంలో మహిళలకు పెద్దపీట వేస్తారని నాయుడు పేట మాజీ ఎంపీపీ కన్నెమ్మ అన్నారు. నాయుడుపేటలో శనివారం తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు సుజాతమ్మ జన్మదినం ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. టీడీపీ హాయంలో పొదుపు గ్రూపులను బలోపేతం చేసి మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించారన్నారు. ప్రతి సంక్షేమ, అభివృద్ధి పథకంలో మహిళలను భాగస్వామ్యంచేసిన ఘనత టీడీపీకే దక్కిందన్నారు.

## బొజ్జలకు పేట నాయకుల సన్మానం



నాయుడుపేట, జూన్ 15: శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన బొజ్జల సుధీర్‌రెడ్డిని శనివారం శ్రీకాళహస్తిలో నాయుడు పేట టీడీపీ నాయకులు సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. గతంలో సుధీర్‌రెడ్డి తండ్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా, మంత్రిగా రాష్ట్రానికి ఎనలేని సేవ చేశారని గుర్తు చేసుకున్నారు. తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు ఏ.సుధీర్, జి.సుధీర్‌రెడ్డి ఉన్నారు.

## విధుల నుంచి మున్సిపల్ టీపీబీవో తొలగింపు

నాయుడుపేట, జూన్ 15: నాయుడుపేట పురపాలక సంఘంలో వార్డు ప్లానింగ్, రెగ్యులేషన్ కార్యదర్శి, టీపీబీవో(టౌన్ ప్లానింగ్ అండ్ బిల్డింగ్ ఆఫీసర్) ఇన్‌చార్జిగా పనిచేస్తున్న కె. వెంకటేష్‌ను విధుల నుంచి తొలగిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జనార్దన రెడ్డి శనివారం తెలిపారు. సదరు వెంకటేష్ మున్సిపాలిటీలోని 15 వార్డుల పరిధిలో అనధికార కట్టడాలు, లేఅవుట్లపై సకాలంలో చర్యలు తీసుకోనందున అతని నిర్లక్ష్య వైఖరిపై కొందరు హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు సరైన సంజాయిషి ఇవ్వనందున వెంకటేష్‌ను జూన్ 14నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. నూతనంగా మున్సిపాలిటీ టీపీబీవోగా ఎస్‌కె హుమయూన్ బాషాకు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు తెలిపారు.

## ఆటో డెబిట్ నుంచి స్త్రీనిధి రుణాలు

కోట, జూన్ 15 : స్త్రీనిధి రుణాల నగదును ఆటో డెబిట్ ద్వారా ఆయా ఖాతాలకు నేరుగా చేరు తుం దని క్రాంతి పథం కమ్యూనిటీ కో ఆర్డినేటర్ శ్రీకాంత్ చెప్పారు. మండలం లోని ఊనుగుంటపాళెంలో శనివారం సంఘ అధ్యక్షురాలు, పొదుపు మహిళలతో స్త్రీనిధి రుణాల మంజూరు, రికవరీలపై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ... స్త్రీనిధి రుణాలు చెల్లింపుల్లో తగు జా గ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రూపునకు రుణం అందేలా చర్యలు తీసు కుంటున్నామన్నారు. రుణాల చెల్లింపుల్లో ఎలాంటి జాప్యం చేయకూడద న్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి కొత్త స్త్రీనిధి రుణాలను ఇచ్చేందుకు గ్రూపులపై సర్వే నిర్వహించామన్నారు.

## బైక్ ర్యాలీని విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న మునిగిరీష్

గూడూరు, జూన్ 15: ఈ ఎన్నికల్లో కూటమి విజయం సాధిం చడంతోపాటు జనసేన అధినేత పవన్ ఉపముఖ్యమంత్రి పదవిని పొందిన సందర్భంగా ఆదివారం నెల్లూరులో నిర్వహించనున్న బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని జనసేన నాయకుడు మునిగిరీష్ అన్నారు. శనివారం డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర అధికారప్రతినిధి అజయ్ ఆధ్వర్యంలో జరిగే బైక్ ర్యాలీకి గూడూరు నుంచి తరలిరావాలన్నారు. ఆదివారం మధ్యాహ్నం 2గంటలకు సుందర్‌మహల్ థియేటర్ నుంచి నెల్లూరుగా బయలుదేర నున్నామని నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఇంద్రవర్థన్, చంద్రనీల్, సూర్యప్రకాష్, నయ్యూం, వెంకటేశ్వర్లు, విజయ్, శీను, మధు, రవి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కొల్లుకు టీడీపీ నాయకుల అభినందన

తడ, జూన్ 15: రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను మండల టీడీపీ నాయకులు అభినందించారు. శనివారం మచిలీపట్నంలో మంత్రి స్వగృహంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలుసుకొని అభినందించారు. ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలవడంతోపాటు మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శాలువాతో సత్కరించారు.

## గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



సురేష్‌బాబు (ఫైల్ ఫొటో)

నిండ్ర, జూన్ 15: నిండ్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సురేష్‌బాబు(52) గుండెపోటుతో మృతి చెందారు. ఆయన శనివారం విధులకు హాజరై విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తూ గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయారు. విద్యార్థులు కేకలు వేయడంతో ఉపాధ్యాయులు వెంటనే నిండ్రలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యసేవలు అందిస్తుండగా మృతి చెందారు. సురేష్‌బాబు మృతికి ఎంఈవోలు, ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు సంతాపం వ్యక్తం చేశారు.

# కూటమి ప్రభుత్వంలో ప్రజారంజక పాలన

**అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు ● రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ**

**నెల్లూరులో 'థ్యాంక్స్ టూ గాంధీజీ' పేరుతో భారీ ర్యాలీ**



గాంధీ బొమ్మ వద్ద ప్రసంగిస్తున్న పురపాలక శాఖ మంత్రి నారాయణ

నెల్లూరు (విద్య), జూన్ 15: రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో ప్రజారంజక పాలన జరుగుతుందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 'థ్యాంక్స్ టూ గాంధీజీ' పేరుతో వీఆర్‌సీ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి గాంధీబొమ్మ వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనకు స్వస్తి పలుకుతూ ప్రజలంతా తమ ఓటుతో బుద్ధి చెప్పారన్నారు. ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి, యువత సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సీఎం చంద్రబాబు ఐదు సంతకాలు చేశారన్నారు. అంతేగాక ఇచ్చిన హామీలతోపాటు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలన్నిటికీ శ్రీకారం చుడుతున్నట్లు చెప్పారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సోమిరెడ్డి మాట్లాడుతూ... అన్యాయంపై న్యాయం విజయకేతనం ఎగురవేసిన తరుణంలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. జిల్లాలో ఓ ఎంపీ, పదిమంది ఎమ్మెల్యేల విజయంతో చారిత్రాత్మిక తీర్పు ఇచ్చిన ప్రజల రుణం తీసుకుంటామన్నారు. మాజీ మంత్రి కాకాణి ఆధ్వర్యంలో జిల్లాలో భూ కుంభకోణం, మైనింగ్ దోపిడీ, జగనన్న కాలనీల పేరుతో అక్రమాలు, ఇరిగేషన్‌లో జరిగిన దోపిడీలపై ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేసి అక్రమాలను వెలికితీస్తామన్నారు. మంత్రి నారాయణ ఇప్పటికే దీనిపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పాలభిషేకం నిర్వహించి ర్యాలీగా గాంధీబొమ్మ వరకు చేరుకున్నారు. అక్కడ గాంధీజీకి పాలభిషేకం చేసి, బాణాసంచాతో సందడి చేశారు. అనంతరం ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పాశం సునీల్ కుమార్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్‌అజీజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, నాయకులు ఆనం వెంకటరమణారెడ్డి, రూప్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్మాణాల్లో అవకతవకలపై చర్యలు: కురుగొండ్ల



వెంకటగిరిలో అన్నక్యాంటీన్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, జూన్ 15 : పట్టణంలో గుంటకట్టపై వాకింగ్ ట్రాక్ నిర్మాణంలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రామకృష్ణ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన ట్రాక్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... గుంటకట్టలో బోట్ షికార్‌ను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కాగా ఇప్పటి వరకు ప్రజా విజ్ఞప్తుల స్వీకరణ కోసం వినియోగిస్తున్న అన్న క్యాంటీన్ పరిశీలించి అందులో ఫర్నిచర్‌ను తొలగించాలన్నారు. గత ప్రభుత్వం అన్న క్యాంటీన్లను మూసివేసి పేదల కడుపు కొట్టిందన్నారు. అందుకే తాను తన సొంత నిధులతో వెంకటగిరి, రాపూరు మండల కేంద్రాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసి మూడేళ్ల పాటు పేదల ఆకలి తీర్చానన్నారు. పి.రాజేశ్వరరావు, బి.రాజేశ్వరరావు, పి.విశ్వనాథనాయుడు, పి. చంద్రమౌళిరెడ్డి, టి.శివారెడ్డి, వి.కోటేశ్వరరెడ్డి, ఏ.సత్యనారాయణ, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి నారాయణకు ఎమ్మెల్యే పాశిం అభినందనలు





నారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్ - నారాయణకు వేనాటి సతీష్ రెడ్డి తదితరుల సన్మానం

గూడూరు/ చిట్టామూరు, జూన్ 15: మున్సిపల్ శాఖ మంత్రిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన నారాయణ జన్మదినం సందర్భంగా శనివారం నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మున్సిపల్‌శాఖ మంత్రిగా పనిచేసిన నారాయణ మున్సిపాలిటీల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. తిరిగి అదే శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టడంతో వాటి అభివృద్ధికి ఆయన సహకారం అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మంత్రిని కలిసిన వారిలో గూడూరు నాయకులతో పాటూ చిట్టమూరు మండల టీడీపీ కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడు, ఎం. జనార్దన్‌రెడ్డి, ఎన్.రాజేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

**సూళ్లూరుపేట:** రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ జన్మదిన వేడుకలను శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ చిత్రపటంతో ఉన్న కేక్‌ను కట్‌చేసి పంచిపెట్టారు. పార్టీ బీసీ సెల్ నాయకుడు చిట్టేటి పెరుమాల్ ఆధ్వర్యంలో నెల్లూరుకువెళ్లి అక్కడ నారాయణను సన్మానించారు. నాపా మునిరాజా, వి.రమేష్, పి.చంద్రారెడ్డి, వి.జనార్దన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భీమవరానికి రుణపడి ఉంటాం: నెలవల



విజయశ్రీ, నెలవలను సన్మానిస్తున్న భీమవరంవాసులు

నాయుడుపేట టౌన్, జూన్ 15: తన సొంత గ్రామం భీమవరానికి రుణపడి ఉంటామని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే విజయశ్రీతో కలసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం విజయశ్రీ ఎమ్మెల్యేగా గెలుపొందిన తరువాత మొట్టమొదటిసారిగా సొంత గ్రామమైన భీమవరానికి వెళ్లడంతో గ్రామస్తులు భారీ గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ... తన రాజకీయ అరంగ్రేటం భీమవరం సర్పంచ్‌తోనే మొదలైందన్నారు. ఆనాడు భీమవరంవాసులు తనను గెలిపించారన్నారు.

## సిలికా భూముల పరిశీలన



చిల్లకూరు, జూన్ 15: మండలంలోని మోమిడి గ్రామంలో శనివారం మైనింగ్ ఏడీ రంగకుమార్, మైనింగ్ విజిలెన్స్ ఏడీ బాలాజీనాయక్ సిలికా భూములను లు పరిశీలించారు. ముందుగా తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు శ్రీనివాసులుతో సమావేశమై మోమిడిలోని సిలికా భూముల్లో సర్వే చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా తహసీల్దారు, మైనింగ్ అధికారులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జరిగిన సిలికా అక్రమ తవ్వకాలపై సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఫిర్యాదుతో సర్వే చేపట్టి నివేదికలను సిద్ధం చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే మోమిడిలో సిలికా భూములను పరిశీలిస్తున్నామన్నారు. ప్రభుత్వ, పట్టా భూముల్లో ఎంతమేర సిలికా తవ్వకాలు చేపట్టారనే విషయాలపై సర్వే నిర్వహిస్తున్నామన్నారు. వారి వెంట సర్వేయర్ భరత్ కూడా ఉన్నారు.

# తాగు, సాగునీరందేలా చర్యలు తీసుకోండి



అధికారులకు సూచనలిస్తున్న ఎంపీపీ

సూళ్లూరుపేట, జూన్ 15: తాగునీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి నీటి సమస్య తలెత్తకుండా అధికారులు చొరవ తీసుకోవాలని ఎంపీపీ ఏ.అనిల్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వచ్చేది వ్యవసాయ సీజన్ కాబట్టి రైతులకు సాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. మన్నెముత్తేరి వద్దనున్న చెక్‌డ్యాం గత ఏడాది డిసెంబరులో వచ్చిన వరదకు పూర్తిగా దెబ్బతిన్నా ఇప్పటి వరకు ఇరిగేషన్ అధికారులు ఎందుకు పట్టించుకోలేదన్నారు. ఈ చెక్‌డ్యాం కింద దాదాపు 8 పంచాయితీలకు సాగునీరందుతుందని సత్వరమే మరమ్మతులు చేస్తే రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. అదే విధంగా ఆర్టీసీ అధికారులు తీర ప్రాంత గ్రామాల్లో ఒక బస్సు నైట్‌హాల్టు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండల సమావేశానికి రాని అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో ప్రైవేట్ పాఠశాలలకు చెందిన బస్సుల వేగాన్ని నియంత్రించడమేకాకుండా ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను విద్యాశాఖ అధికారులు పరిశీలించాలని ఎంపీడీవో చంద్రమౌళి ఆదేశించారు. అదే విధంగా వసతి గృహాల్లో మెనూ ప్రకారం భోజనాలు పెడుతున్నారా లేదా సంబధిత పంచాయతీ కార్యదర్శులు పరిశీలించి నివేదికలు ఇవ్వాలన్నారు. జడ్పీటీసీ సభ్యురాలు సుప్రియ, ఏవో కవతి, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ ఏఈలు ఉమామహేశ్వరి, రాఘూర్ తదితరులు పాల్గొన్నారు.

## సప్లై ఛానల్ తవ్వించి ఆదుకోండి

● సాగునీటి కాలువ పూడ్చివేతపై ఫిర్యాదు



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పెళ్లకూరు, జూన్ 15: మండలంలోని రావులపాడు చెరువుకు సాగునీరు సరఫరా అయ్యే కాలువను తిరిగి తవ్వించి ఆదుకోవాలని లేకుంటే పొలాలు బీడుగా మారిపోతాయని రైతులు తహసీల్దార్ కేవీ ఆర్వీ ప్రసాద్‌రావుకు వినతి పత్రం అందజేశారు. చెంబేడు సప్లై ఛానల్ ద్వారా రావులపాడు చెరువుకు సాగునీరందించే కాలవను జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పూడ్చివేశారు. అయితే ప్రత్యామ్నాయ మార్గం చూపలేదన్నారు.. వర్షాకాలం ప్రారంభం కానుండడంతో చెరువుకు నీరు చేరదన్నారు. దీంతో రావులపాడు చెరువు కింద ఉన్న వందలాది ఎకరాలు బీడు పెట్టుకోవాల్సిందేనని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తహసీల్దార్ ప్రసాద్ రావు మాట్లాడుతూ... హైవే అధికారులతో చర్చించి కాలువను తవ్విస్తామని చెప్పారు.

## పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

**తృటిలో తప్పిన ప్రమాదం**



కోట, జూన్ 15 : మండల పరిధిలోని కొండుగుంటవద్ద శనివారం ఆర్టీసీ బస్సు పొలాల్లోకి దూసుకు వెళ్లడంతో తృటిలో పెను ప్రమాదం తప్పింది. వాకాడు డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసు నెల్లూరు వైపు వెళ్తోంది. కొండుగుంట వద్ద ఒక్కసారిగా పొలాల్లోని గొర్రెలు పరుగులు తీస్తూ రోడ్డుపైకి వచ్చాయి. వాటితోపాటు గొర్రెలకాపరి రావడంతో వాటిని తప్పించబోయి బస్సును డ్రైవర్ చాకచక్యంగా పొలాల్లోకి దింపేశాడు. ఈ సంఘటనలో గొర్రెలకాపరికి స్వల్పగాయాలు కాగా ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు.

## ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కోట, జూన్ 15: మండల పరిధిలోని చిట్టేడులోని గిరిజన బాలుర సంక్షేమ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎన్ శేషవర్ధన్ శనివారం తెలిపారు. కళాశాలలో ఇంటర్‌లో ఎంపీసీలో 24, బైపీసీలో 34, హెచ్ఈసీలో 24, ఒకేషనల్ కోర్సులో 13 వంతున సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన యానాది, ఎరుకుల విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. ఉమ్మడి నెల్లూరుజిల్లా వాసులై ఉండాలన్నారు. వివరాలకు నెం. 9441033361లో సంప్రదించాలన్నారు.

## మాదిగల కవాతును విజయవంతం చేయండి

నాయుడుపేట టౌన్, జూన్ 15: మాదిగల కవాతును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి సిసింద్రిమాదిగ పిలుపునిచ్చారు. నాయుడుపేట పట్టణంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జూలై 7న వరంగల్‌లో చేపట్టబోయే కవాతుకు నియోజకవర్గం నుంచి వేలాదిమంది తరలివెళ్లి విజయవంతం చేద్దామని కోరారు. కె. రవిమాదిగ, శ్రీనివాసులుమాదిగ, హేమంత్‌మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం

సూళ్లూరుపేట, జూన్ 15: అనారోగ్యంతో బాధపడుతున్న లక్ష్మికి చిరంజీవి సేవా సంఘం ఆర్థికం సాయం అందజేసింది. పట్టణంలోని గణపతి నగర్‌కు చెందిన లక్ష్మి నెల్లూరు నగరంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్సలు చేయించుకుంటోంది. అక్కడి వైద్యులు ఆమె కడుపులో 5 కిలోల కణితి ఉన్నట్లు గుర్తించి శస్త్రచికిత్స చేయాలని పేర్కొన్నారు. రూ.50 వేలు పైబడి ఖర్చు అవుతుందని తెలిపారు. సమాచారం అందుకున్న చిరంజీవి సేవా సంఘ అధ్యక్షుడు మా బాషా స్పందించి శనివారం వారి ఇంటికెళ్లి ఆమె వైద్యం ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు అందించారు.

## కల్లూరులో జనసేన ఫ్లెక్సీలకు నిప్పు



వాకాడు, జూన్ 15: మండలంలోని కల్లూరు పంచాయతీలో డిప్యూటీ సీఎం, పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఫ్లెక్సీలకు శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ఆయన అభిమానులు శనివారం రోడ్డెక్కారు. ఈ సందర్భంగా జనసేన మండల అధ్యక్షుడు రౌతు శివకుమార్ మాట్లాడుతూ... సాక్ష్యాత్తు డిప్యూటీ సీఎం ఫ్లెక్సీకి నిప్పుపెట్టి సైకో వైసీపీ నాయకులు కించపరచడం మంచిపద్ధతి కాదన్నారు. ఇలాంటి అకృత్యాలు చేయడంవలనే వైసీపీ అధఃపాతానికి దిగ జారిపోతుందన్నారు. ఇకనైనా వైసీపీ నాయకులు సౌమ్యంగా నడుచు కోవాన్నారు. ఫ్లెక్సీలను తగులపెట్టడంపై పోలీసు స్టేషన్‌లో ఇప్పటికే ఫిర్యాదు చేశామన్నారు. ఇలాంటివి పునరావృత్తమైతే కఠిన చర్యలు తీసుకుంటా మని ఎస్ఐ పవన్‌కల్యాణ్ హెచ్చరించారు.

## మంత్రిని సన్మానించిన ఎమ్మెల్యే విజయశ్రీ



నాయుడుపేట/టౌన్, జూన్ 15 : రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణను సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ దంపతులు సన్మానించారు. శనివారం మంత్రి నారాయణ జన్మదినాన్ని పురస్కరించుకొని నెల్లూరులోని మంత్రి స్వగృహంలో విజయశ్రీ, పార్థసారథి దంపతులు మంత్రికి శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## ముఖేష్‌ను ఆదర్శంగా తీసుకోండి



వెంకటగిరిటౌన్, జూన్ 15: ఇటీవల నీట్‌లో మొదటి ర్యాంక్ సాధించి వెంకటగిరి పేరును నిలబెట్టిన వి.ముఖేష్ చౌదరిని ఆదర్శంగా తీసుకోవాలని రాజా కుటుంబీకులు, ఏసీఏ మాజీ ఛైర్మన్ సర్వజ్ఞ యాచేంద్ర అన్నారు. శనివారం స్థానిక రాజా ప్యాలెస్‌లో ముఖేష్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని గమ్యం చేరాలని కోరారు.

# శ్రీకాళహస్తి
# సత్యవేడు

## ఎంపీడీవో కార్యాలయంలో కాగితాలు తగులబెట్టేశారు!



కాగితాలను తగులబెడుతున్న సిబ్బంది

సత్యవేడు, జూన్ 15: సత్యవేడు ఎంపీడీవో కార్యాలయంలో శనివారం కాగితాలను తగుల బెట్టడం చర్చనీయాంశంగా మారింది. కార్యాలయ ఆవరణలో సిబ్బంది కాగితాలను పెద్ద ఎత్తున కాల్చివేశారు. కార్యాలయంలో చిత్తు కాగితాలు పేరుకుపోవడంతోనే వాటిని తగుల బెడుతున్నట్లు అధికారులు చెబుతున్నప్పటికీ, రాష్ట్రంలో నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ప్రస్తుత తరుణంలో హడివిడిగా కాగితాలను ఉన్నపళంగా కాల్చడం వెనుక ఏమైనా కారణాలు ఉన్నాయా అని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

## భక్తజనసంద్రంగా ముక్కంటి ఆలయం



ముక్కంటి ఆలయ క్యూలైన్లలో భక్తులు

శ్రీకాళహస్తి, జూన్ 15: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం భక్తజన సంద్రంగా మారింది. వారాంతపు సెలవులు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 30వేలమంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇందులో రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 2,046మంది, రూ.50 టిక్కెట్ల ద్వారా 2,859 మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 టిక్కెట్ల ద్వారా 2,662మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,011, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 328మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 245మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 72మంది భక్తులు రాహుకేతు పూజలు చేయించుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 17,491 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

నాగలాపురం, జూన్ 15: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన ఘటన శనివారం నాగలాపురం మండలం సుబ్బానాయుడు కండ్రిగ గ్రామంలో చోటు చేసుకుంది.పోలీసుల వివరాల మేరకు.. సుబ్బానాయుడు కండ్రిగ గ్రామానికి చెందిన సుధాకర్(70) ఇంటి నుంచి సొంత పనులపై పక్క గ్రామం చిన్నాపట్టుకు బయలుదేరాడు. సుబ్బానాయుడు కండ్రిగ వద్ద రోడ్డు దాటుతుండగా తిరుపతి నుంచి చెన్నై వైపు వెళ్తున్న కారు సుధాకర్‌ను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన సుధాకర్‌ను స్థానికులు ప్రైవేట్ వాహనంలో నాగలాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ ఓబయ్య కేసు దర్యాప్తు చేపట్టారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఉపాధ్యాయుడి మృతి

శ్రీకాళహస్తి, జూన్ 15: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మునిరాఘవులు(57) చికిత్స పొందుతూ మృతి చెందాడు. శ్రీకాళహస్తి పట్టణం బంగారమ్మ కాలనీలోని దర్గావీధికి చెందిన మునిరాఘవులు పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో బయాలజీ ఉపాధ్యాయుడుగా పనిచేసేవారు. ఈనెల 6వ తేదీన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా బంగారమ్మ కాలనీ వద్ద గుర్తు తెలియని ఆటో ఢీకొంది. తీవ్రంగా గాయపడిన మునిరాఘవులును కుటుంబసభ్యులు తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అందరినీ కలుపుకుని పనిచేస్తా: ఆదిమూలం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

కేవీబీపురం, జూన్ 15: సత్యవేడు నియోజకవర్గ అభివృద్ధి కోసం అందరినీ అందిరనీ కలుపుకుని పనిచేస్తానని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. కేవీబీపురంలో శనివారం టీడీపీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం వచ్చినా సత్యవేడు అభివృద్ధే ధ్యేయంగా టీడీపీలో చేరి ఎమ్మెల్యేగా విజయం సాధించానని చెప్పారు. అయితే తనతో ఉంటూనే కొంతమంది వెన్నుపోటు దారులుగా మారారని, నా విజయం వారికి గుణపాఠం అయిందన్నారు. అయినా ఎవరి మీద కక్షసాధింపులు ఉండవన్నారు. ఏడు మండలాల్లో ఎంతోమంది నాయకులు, కార్యకర్తలు నా వెన్నంటి ఉండి గెలుపునకు కృషి చేశారని, వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎవరికి ఏ అవసరం ఉన్నా తన వద్దకు రావాల్సిన అవసరం లేదని, కబురు చేస్తే తానే వచ్చి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



ఆక్రమణలను సర్వే చేస్తున్న అధికారులు - రాజీవ్‌నగర్‌లో తొలగింపు పనులు

## ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం

శ్రీకాళహస్తి, జూన్ 15: శ్రీకాళహస్తి పట్టణంలో ఐదేళ్ల పాటు వైసీపీ చేసిన భూకబ్జాలపై అధికార యంత్రాంగం కొరడా ఝుళిపించింది. శుక్రవారం పంచాయతీరాజ్ అతిథిగృహంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. శనివారం ఉదయం నుంచి ఆక్రమణలపై సర్వేచేసి చర్యలు తీసుకోవాలంటూ ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. దీంతో రెవెన్యూ, పురపాలక, పోలీసు అధికారులు సంయుక్తంగా రంగంలోకి దిగారు. రాజీవ్‌నగర్ కాలనీలో పిచ్చాటూరు రహదారికి ఆనుకుని రోడ్డు పక్కనే ఒకటిన్నర కిలోమీటరు పాటు అక్రమంగా నిర్మాణాలు చేపట్టినట్లు అధికారులు గుర్తించారు. పోలీసు బందోబస్తు మధ్య యంత్రాలతో అక్రమ నిర్మాణాల తొలగింపు రాజీవ్‌నగర్ నుంచి ప్రారంభించారు. ఇక పురపాలకసంఘ అధికారులు పట్టణ వ్యాప్తంగా ప్రభుత్వ స్థలాలపై అధ్యయనం చేశారు. పట్టణ నడిబొడ్డున పెద్దమసీదువీధిలో మురుగు కాలువపై నిర్మించిన దుకాణాన్ని తొలగించారు. అలాగే తిరుపతి రోడ్డుకు ఆనుకుని ఎన్టీఆర్ పార్కు ఎదుట ఏర్పాటు చేసిన దుకాణాన్ని మూసి వేయించారు. ఇక ముక్కంటి ఆలయ సమీపంలో ఉన్న పురపాలక సంఘానికి చెందిన కట్టడం నుంచి భారీగా అద్దె బకాయిలు ఉన్నట్లు గుర్తించి ఆ భవనాన్ని సీజ్ చేశారు.

## విద్యతోనే పేదరికం దూరం: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



విద్యార్థులతో సెల్ఫీ దిగుతున్న సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జూన్ 15: విద్యతోనే పేదరికం దూరమవుతుందని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు విద్యా కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. ఆయన దూరదృష్టితోనే జిల్లాలో పలు విద్యాసంస్థలు ఏర్పాటు అయ్యాయని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన విద్యాకిట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సెల్ఫీ దిగారు. ఆయనను ఎంఈవోలు, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవోలు బాలయ్య, భువనేశ్వరి, ప్రధానోపాధ్యాయురాలు రాజకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దుపై న్యాయవాదుల హర్షం

సత్యవేడు, జూన్ 15: రాష్ట్రంలో కొలువుదీరిన నూతన టీడీపీ ప్రభుత్వం ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేయడంపై సత్యవేడు బార్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక కోర్టు ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేసినందుకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌తో ప్రజలు తమ ఆస్తులపై హక్కులు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు ఫైల్‌పై చంద్రబాబు రెండో సంతకం చేయడం చరిత్రాత్మక నిర్ణయమన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు కృష్ణారావు, లోకేశులు, శ్రీరామమూర్తి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్యశిబిరం

శ్రీకాళహస్తి, జూన్ 15: పట్టణంలోని బీపీ అగ్రహారం ప్రాథమిక పాఠశాలలో రాష్ట్రీయ సేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. తిరుపతికి చెందిన టాటా ట్రస్టు, చదలవాడ కృష్ణతేజ డెంటల్ కళాశాల ఆధ్వర్యంలో క్యాన్సర్, దంత వైద్యపరీక్షలు నిర్వహించారు. ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటేష్ మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందుగా గుర్తించి తగు చికిత్స చేయించుకుంటే నయం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో టాటా ట్రస్టు డాక్టర్ వెంకయ్యబాబు, మెహతాజ్, అర్చన, మహేంద్ర, డెంటల్ కళాశాల డాక్టర్ శ్రీకాంత్, రాస్ సిబ్బంది వినోద్, ముఖేష్ కుమార్, నాగలక్ష్మి, మీనా, షబానా, విజయలక్ష్మి, క్లస్టర్ లీడర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సుధీర్‌రెడ్డికి సన్మానం

శ్రీకాళహస్తి, జూన్ 15: ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని హజరత్ జుంలేషా పీర్ దర్గా ఉరుసు కమిటీ తరపున దర్గా నిర్వాహకులు సయ్యద్ ఆహ్మద్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఉరుసు కమిటీ ప్రెసిడెంట్ ఓరుగంటి నాగేశ్వరరావు, సభ్యులు రాజేశ్వరరావు, రమేష్‌బాబు, జమ్రుద్‌బాషా, మౌలానా సాజిద్, ఖాదర్‌బాషా, దర్గా నిర్వాహకులు బాబా ఫరీద్, మహమద్ అన్సర్ కాలేషా పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

కేవీబీపురం, జూన్ 15: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. శనివారం కేవీబీపురంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు, బ్యాగులు, బెల్టులు, షూలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులునాయుడు, తిరుపతి పార్లమెంటు తెలుగు రైతు అధ్యక్షుడు గోపినాథ్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జీవో 117ను రద్దు చేయాలి

శ్రీకాళహస్తి, జూన్ 15: ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసే జీవో 117ను రద్దు చేయాలని ఎస్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు గుమ్మడి మురళి శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిన 3,4,5 తరగతులను వెనక్కి తీసుకోవాలని కోరారు. ఆంగ్ల మాధ్యమానికి సమాంతరంగా తెలుగు మాధ్యమాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## సమస్యలను పరిష్కరించండి

శ్రీకాళహస్తి, జూన్ 15: రాష్ట్రంలో జూనియర్ లెక్చరర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆ అసోసియేషన్ నాయకులు శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి కోట వినుతను కోరారు. శనివారం ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లను పర్మినెంట్ చేస్తామని గత ప్రభుత్వం జీవో ఇచ్చినా ఇంత వరకు అమలు చేయలేదన్నారు. వినుత మాట్లాడుతూ సమస్యను ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## 19న ముక్కంటి ఆలయ హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి, జూన్ 15: ముక్కంటి ఆలయంలో ఈనెల 19వ తేదీ బుధవారం హుండీ లెక్కింపు నిర్వహించనున్నట్లు ఈవో నాగేశ్వరరావు తెలిపారు. ఆలయ ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ఆదాయాన్ని గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద లెక్కించనున్నట్లు తెలిపారు.

## వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, జూన్ 15: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన అభయ వెంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి వివిధరకాల అభిషేకాలు చేసి నగలు, పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ వేదపండితులు తీర్థప్రసాదాలు అందజేశారు.

## లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

శ్రీకాళహస్తి, జూన్ 15: శ్రీకాళహస్తి కోర్టులో ఈనెల 29వ తేదీ నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా అదనపు న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ అన్నిశాఖల సహకారంతో లోక్ అదాలత్‌ను విజయవంతం చేద్దామన్నారు. ప్రతిఒక్కరూ లోక్అదాలత్‌ను ఉపయోగించుకోవాలని కోరారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వరదయ్యపాళెం, జూన్ 15: వరదయ్యపాళెం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8నుంచి 11 గంటల వరకు మండలంలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శివప్రసాద్ తెలిపారు.









# పుత్తూరు వార్తలు

## కేసుల పరిష్కారానికి కృషి చేయండి



పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు అర్బన్, జూన్ 15: పుత్తూరు కోర్టులో ఈనెల 29వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర పోలీసు అధికారులకు సూచించారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో పుత్తూరు, నారాయణవనం, వడమాలపేట, కార్వేటినగరం, రామచంద్రాపురం, వెదురుకుప్పం, ఎస్ఆర్ పురం మండలాల పోలీసు, ఎక్సైజ్‌శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ స్టేషన్ల వారీగా రాజీకి వీలయ్యే క్రిమినల్ కేసుల పరిష్కారానికి పోలీసులు చొరవ తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఎస్పీ వై.శ్రీనివాసరావు, సీఐలు ఓబులేశు, భాస్కర్‌నాయక్, పీఎస్. సత్యబాబు, ఎస్‌ఐలు రాజాకుళ్లాయప్ప, వెంకటకృష్ణ, లక్ష్మీనారాయణ, ఎస్ఈబీ అధికారులు వై.ఉరుకుందమ్మ, జి.భారతి తదితరులు పాల్గొన్నారు.

## సదాశివేశ్వరాలయం హుండీ లెక్కింపు

పుత్తూరు, జూన్ 15: పుత్తూరు పట్టణంలోని సదాశివేశ్వరాలయ హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. మొత్తం రూ.3,41,418 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో రామచంద్రారెడ్డి తెలిపారు. ఆలయ తనిఖీ అధికారి సుమనప్రియ ఆధ్వర్యంలో జరిగిన ఈ లెక్కింపులో గ్రామపెద్దలు జీవరత్నం నాయుడు, విక్కీ రాయల్, మురళీకృష్ణ, దాము, జి.బాబు, అయ్యప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యావ్యవస్థలో సాంకేతిక మార్పులకు శ్రీకారం



విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

వడమాలపేట, జూన్ 15: రాష్ట్ర మానవ వనరులశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా లోకేశ్ విద్యావ్యవస్థలో నూతన సాంకేతిక మార్పులకు శ్రీకారం చుడుతున్నట్లు నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తెలిపారు. శనివారం వడమాలపేటలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి, మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమనాయుడు గతంలో విద్యాశాఖ మంత్రిగా నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి కృషి చేశారన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచాక మొట్టమొదట విద్యార్థులకు కిట్లు అందించడం సంతోషంగా ఉందన్నారు. గత ఐదేళ్లలో విద్యావ్యవస్థ నిర్వీర్యం అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో 2400 విద్యార్థులకు కిట్స్ అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈవో శేఖర్, టీడీపీ నాయకులు మురళీరెడ్డి, ధనంజయులు నాయుడు, వెంకటయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వడమాలపేట ప్రజలకు రుణపడి ఉంటా: ఎమ్మెల్యే భాను

వడమాలపేట, జూన్ 15: వడమాలపేట ప్రజలకు రుణపడి ఉంటానని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చెప్పారు. శనివారం వడమాలపేట టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరువేల పైచిలుకు ఓట్ల మెజారిటీ అందించి తన విజయానికి సహకరించిన మండల ప్రజలకు రుణపడి ఉంటానని చెప్పారు. భారీ మెజారిటీ రావడానికి కృషి చేసిన నాయకులను అభినందించారు. మండలంలో సమస్యలను పరిష్కరించి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం భానుప్రకాష్‌ను నాయకులు, కార్యకర్తలు సన్మానించారు.



భానుప్రకాష్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు